క్లుప్తంగా

నితీష్‌కుమార్‌రెడ్డికి అభినందనలు



నితీష్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న తుంగ్లాం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భారత క్రికెటర్ కాకి నితీష్‌కుమార్‌రెడ్డిని సోమవారం 69వ వార్డు తుంగ్లాం నాయకులు అభినందించారు. గ్రామ నాయకుడు కరణం ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో నాయకులు కలిసి నితీష్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. విశాఖ ఖ్యాతిని ఖండాంతరాల్లో నిలిపిన నితీష్ కుటుంబ సభ్యులతో అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. నితీష్ మరిన్ని అద్భుతమైన విజయాలు ఇండియాకు అందజేయాలని ఆకాంక్షించారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న పారిశుధ్య కార్మికులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పారిశుధ్య కార్మికులకు ఈనెల 11న పెదమడగ మస్టర్ పాయింట్ వద్ద గేమ్ ఛేంజ్ పేరిట డ్రా తీశారు. సోమవారం భోగి పండగ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, ఎస్. రాజు, సత్యవతి, కనకరాజు, నాగమణి పాల్గొన్నారు.

భోగి మంటల్లో కరెంట్ బిల్లులు



భోగి మంటలో కరెంట్ బిల్లు దహనం చేస్తున్న కమ్యూనిస్ట్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ చార్జీలతో సామాన్య ప్రజల నడ్డివిరిచిన కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ కమ్యూనిస్ట్ నాయకులు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో భోగి మంటల్లో కరెంట్ బిల్లులను దహనం చేశారు. సోమవారం భోగి సందర్భంగా రామాలయం ఎదుట గ్ భోగి మంటల్లో బిల్లులు తగుల బెట్టారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచనని ప్రజలను నమ్మించి వంచన చేశాడని దుయ్యబట్టారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బన్న, కోటేశ్వరరావు, దాసరి అప్పారావు, లోకేష్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం



గోదాదేవి రంగనాథస్వామిల కల్యాణం చేస్తున్న

అగనంపూడి: ధనుర్మాసం 29వ పాశురం సందర్భంగా 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తులను అలంకరింపజేసి కల్యాణోత్సం వైభవోపేతంగా జరిపించారు. తర్వాత తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఈకే చారి దంపతులు, ప్రతినిధులు సాయిబునాయుడు, కృష్ణారావు, నరసింగరావు, సత్యనారాయణ, గురునాథ్, ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రక్తదాత.. సుఖీభవ



రక్తదానం చేస్తున్న వినోద్ బాలు


ఉద్యమంలా రక్తదాన శిబిరాలు
నిరంతరం అవగాహన కార్యక్రమాలు
1022 రక్తదాన శిబిరాల నిర్వహణ
56,545 యూనిట్ల రక్తం సేకరణ
గాజువాక యువకుడు వినోద్‌బాలు నిరంతర కృషి

GIVE BLOOD.. SAVE LIFE

ఆ యువకుడి నినాదం..

రక్తం అందక తండ్రిని పోగొట్టుకున్న అతను.. తనలా మరెవరూ బాధ పడకూడదని నిశ్చయించుకున్నాడు. రక్తం అందక ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోకూడదని సంకల్పించాడు. ఆ సంకల్పం.. అతడిని కొన్ని వేల మంది ప్రాణాలు కాపాడేలా చేసింది. రక్తదానం ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందిస్తూ ముందుకు సాగుతున్నారు గాజువాకకు చెందిన వినోద్ బాలు.

–గాజువాక



2014లో యజ్ఞానానికి అంకురార్పణ

తన మదిలో మెదిలిన గొప్ప ఆలోచనను సాకారం చేయడానికి 2014లో 60 మంది సభ్యులతో ఫ్రెండ్స్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి రక్తదాన శిబిరానికి శ్రీకారం చుట్టారు వినోద్‌బాలు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నో శిబిరాలు ఏర్పాటు చేసి అందరినుంచీ ప్రశంసలు అందుకొంటున్నారు. ఇప్పటివరకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్ల ద్వారా 1022 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 56,545 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తొలుత రోటరీ క్లబ్‌లో చేరి ఈ సేవలు అందించిన వినోద్‌బాలు వందే భారత్ పేరుతో మరో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి రెండేళ్లుగా తన సేవలను మరింత విస్తృతం చేశారు.

తనలా.. మరొకరు బాధపడకూడదనే...

వినోద్‌బాలు ఇంటర్ చదువుతున్న సమయంలో ఆయన తండ్రి అనారోగ్యం బారినపడ్డారు. సకాలంలో రక్తం అందిస్తేనే ప్రాణాలు దక్కుతాయని వైద్యులు సూచించారు. ఎన్నో ప్రయత్నాలు చేసినా అవసరమైన గ్రూపు దొరక్క వినోద్‌బాలు తండ్రి ప్రాణాలు కోల్పోయారు. తన తండ్రిలా మరొకరు ప్రాణాలు పోగొట్టుకోకూడదనే లక్ష్యంతో రక్తదాన శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు.

30 శాతం బ్లడ్ ప్రభుత్వ ఆస్పత్రులకే..

సేకరించిన రక్తంలో 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అందిస్తున్నారు. మిగిలిన **రక్తాన్ని అత్యవసరమైనవారి**కి అందిస్తున్నారు. రక్తం కావాలని ఎవరైనా **వందే భారత్ బ్లడ్ బ్యాంక్‌ను సం**ప్రదిస్తే డోనర్‌ను సమకూర్చుతున్నారు. అవ**సరమైన రక్తం నిల్వ ఉంటే** అందించి ప్రశంసలు అందుకొంటున్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న వినోద్‌బాలు

అందుకున్న అవార్డులు

- 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వం నుంచి యూత్ సర్వీస్ అవార్డు
- 2019లో శివాజీ యూత్ ఫౌండేషన్ నుంచి ఛత్రపతి అవార్డు
- 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినుంచి ప్రశంస లేఖ
- 2018లో జేసీఐ వాల్తేర్ క్లబ్ నుంచి యంగ్ డైనమిక్ పర్సన్ అవార్డు
- 2018లో వైజాగ్ ఎన్జీవో సంస్థల నుంచి ఆపద్బాంధవుడు అవార్డు
- వైజాగ్‌కు చెందిన ప్రేమనిధి ఫౌండేషన్ నుంచి కరోనా వారియర్ అవార్డు
- రక్తదాన సేవలకు గాను మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్ శ్రీధర్ చేతులమీదుగా పౌర సన్మానం
- వీటితోపాటు వినోద్‌బాలు సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు లభించాయి.



పదేళ్లుగా సేవలు

"ఆపదలో ఉన్నవారికి పదేళ్లుగా రక్తం అందిస్తూ సేవ చేస్తున్నాను. అవసరమైనవారికి సకాలంలో రక్తం అందించాలన్నదే నా లక్ష్యం. దీనికోసం నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూనే ఉంటాను. రక్తం దొరలేదనే కారణంతో ఏ ఒక్కరూ చనిపోకూడదన్నదే లక్ష్యం. అనేక స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లు కలిసి వస్తూ నా ఆశయంలో భాగస్వాములవుతుండం చాలా సంతోషంగా ఉంది."

– వినోద్‌బాలు, గాజువాక

పదవులు

- లోక్ అదాలత్ బెంచ్ మెంబర్, గాజువాక కోర్ట్
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శరీర అవయవ దాతల సంఘం



ఘనంగా భోగి పండగ



క్వారీ రోడ్డులో భోగి మంట వద్ద కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు



భోగి వేడుకలో ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

గాజువాక: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గాజువాకలో భోగి మంటల సందడి చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారు జాము మూడున్నర గంటల నుంచే గ్రామాలు, కాలనీల్లో ఉత్సవాలు మొదలయ్యాయి. నలుగు స్నానాలను ఆచరించి భోగి మంటలు వేసి వాటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సందడి చేశారు. గోమయంతో చేసిన చిన్న చిన్న పిడకలను మంటల్లో వేసి ఆనందంతో కేరింతలు కొట్టారు. మంటల్లో ఏర్పడిన బూడిదను తీసి నుదిటిన అలంకరించుకుని భక్తి పారవశ్యంతో పొంగిపోయారు. మరోవైపు భోగి సందర్భంగా పలు ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి దేవతామూర్తులను దర్శించుకున్నారు. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలు నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి క్వారీ రోడ్డులో స్వర్ణ నూకాంబిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొని సందడి చేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు.

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి వారి ఇష్ట దైవాన్ని ప్రార్థించారు. కణితిలో భోగి పండగను ఉత్సాహంగా నిర్వహించారు. 79వ వార్డు శనివాడ జాబిలి హిల్స్ కాలనీలో చిన్నా పెద్దా భోగి మంట వేసి సందడి చేశారు.



భోగిమంట వద్ద సందడి



తిరుమలనగర్‌లో భోగి మంట



కణితి కూడలిలో ..

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు



ఐపీఎల్ ఆటగాడు పైలా అవినాష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: సంక్రాంతి సంబరాలను గాజువాక నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పలు క్రీడా పోటీలను పోటాపోటీగా నిర్వహిస్తున్నారు.

విండ్‌బాల్ టోర్నీ ప్రారంభం

జీవీఎంసీ 87వ వార్డు కణితి యాదవ వీధి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలంతా ఐకమత్యంతో చేసుకొనే సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టోర్నమెంట్ నిర్వాహకులు దేవర తాతారావు, ఇసరపు అప్పలరాజు, చొప్పా శ్రీను, బంధం పరదేశి, ప్రసాద్, చట్టి రాము, వురుకూటి శ్రీనివాస్, కిరణ్, చొప్పా కృష్ణ, చొప్పా అనిల్, లండా సాగర్ పాల్గొన్నారు.

ఐపీఎల్ ఆటగాడు అవినాష్ సందడి

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాళింగ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ప్రీమియర్ లీగ్‌లో మూడో రోజు పోటీలను ఐపీఎల్‌లో పంజాంబ్ కింగ్స్ క్రీడాకారుడు పైలా అవినాష్ ప్రారంభించారు. అవినాష్ మాట్లాడుతూ క్రికెట్ అనేది ఒక యజ్ఞం అన్నారు. ఆటపై ఏకాగ్రత ఉంటూ క్రమశిక్షణ, పట్టుదలతో పాటు మెళకువలు తెలుసుకుంటే పట్టు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, నిర్వాహకులు ప్రగడ ప్రసాద్, దుగ్గపు త్రినాథ్, గున్న వంశీ, ప్రగడ రవి, దుగ్గపు అఖిల్, సంతష్, బొడ్డు సుమంత్, కాండ్రేగుల మనోహర్ పాల్గొన్నారు.

వీఆర్ఎస్ పత్రాలు భోగి మంటల్లో దహనం



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద వీఆర్ఎస్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) పత్రాలను దహనం చేశారు. ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే వీఆర్ఎస్ జారీ చేశారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కంటే సెయిల్‌లో ఎక్కువగా సిబ్బంది ఉన్నప్పటికీ స్టీల్‌ప్లాంట్‌పై కక్షతో ఉక్కు మంత్రిత్వశాఖ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే నాలుగు నెలలుగా జీతాలు అందించకుండా వేధిస్తున్నారన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, రమణమూర్తి, కారు రమణ, డి. శ్రీనివాస్, వరసాల శ్రీనివాస్, తౌడన్న, ఎ. అప్పారావు, లక్ష్మణరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కమనీయం.. గోదా శ్రీనివాసుడి కల్యాణం



మాంగల్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చక స్వాములు



గోదా శ్రీనివాసుడి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో సోమవారం గోదాదేవి శ్రీనివాసుడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు అట్లూరి రమేష్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. వందలాది మంది భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.

- షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు భావనారాయణ స్వామి, అర్చకులు ఉదయ్ కృష్ణమాచార్యులు, హరినారాయణ ఆధ్వర్యంలో రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.



ఉక్కు వెంకన్న ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణలో గోవింద నామ స్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దానప్పతల్లికి సమర్పించిన చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి, కణితి నిర్వాసితకాలనీలు దుగ్గపువానిపాలెం, కణితి, కాశీపాలెం గ్రామాల ఇలవేల్పు దానప్పతల్లికి భక్తులు అందించిన చీరలను భోగి పండగను పురస్కరించుకొని సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు నిరుపేద మహిళలకు పంపిణీ చేశారు. భక్తులు సమర్పించిన 735 చీరలను ఉచితంగా అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దుగ్గపు వెంకట అప్పారావు, ప్రగడ అప్పలనరసింహులు, బొడ్డ సన్యాసిరావు, గోవింద్ మాట్లాడుతూ ఏటా అమ్మవారికి కానుకగా వచ్చిన చీరలను భక్తులు, పేదలకు భోగి పండగ రోజు పంచిపెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో సరకాన రమణ, ప్రగడ శ్రీను, దుగ్గపు దానప్పలు, బొడ్డ వెంకటసూరి, పిన్నింటి సంతోష్, గొనప సన్యాసిరావు, అప్పిని సన్యాసిరావు, దాకా కొండలరావు దుగ్గపు నరసింహమూర్తి, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



పాయసం తయారు చేస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ కోలాటం బృందం, గ్రామ యువకులు, ఐద్వా నాయకులు భోగి మంట వేసి చుట్టూ తిరుగుతూ సంక్రాంతి సంబరాల గీతాలు ఆలపించారు. అనంతరం భోగి మంటలో సంక్రాంతి పాయసం తయారు చేసి అందరికీ పంచారు. గ్రామంలో ఉన్న చిన్నారులకు భోగి పళ్లు పోశారు. కార్యక్రమంలో లోకేష్, రమణమ్మ, శ్రీలక్ష్మి, పద్మ, మంగమ్మ, లక్ష్మి, కిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పళ్ల ఘట్టం